సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం ၊ 25 ၊ జూలై ၊ 2025



పాఠాలు అర్థమవుతున్నాయా..

'టీచర్ చెబుతున్న పాఠం అర్థమవుతోందా.. ఇప్పటివరకు ఏ లెస్సన్ పూర్తయింది'..అంటూ కలెక్టర్ కోయ శ్రీహర్ష 4వ తరగతి విద్యార్థితో ఇంగ్లిష్, 5వ తరగతి విద్యార్థితో తెలుగు పాఠాన్ని చదివించారు. విద్యార్థులు సులువుగా అర్థం చేసుకునేలా అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే వర్షంలో గొడుగు పట్టుకొని పెద్దపల్లి తహసీల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, పరిసరాలను గమనించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి/పెద్దపల్లిరూరల్



పగుళ్లుబారి.. శిథిలావస్థకు చేరి



జిల్లా కేంద్రంలోని తెనుగువాడలో శిథిలావస్థలో ఇల్లు



తిలక్‌నగర్ చౌరస్తాలో

ఈ ఫొటోల్లోని పాత ఇళ్లన్నీ పెద్దపల్లి పట్టణంలోనివి. పేద కుటుంబాలకు చెందిన వారు కావడంతో పగుళ్లు వచ్చినా, గోడలు కూలినా గత్యంతరం లేక ఇప్పటికీ అదే ఇళ్లలో భయంభయంగా జీవనం సాగిస్తున్నారు. ఇల్లు ఖాళీ చేసి వేరే ఇంటికి పోయే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే పథకాల్లో తమకు అవకాశం ఇస్తే కొత్తింటి నిర్మాణానికి పూనుకుంటామని పేర్కొంటున్నారు.



శ్రీరాంనగర్‌లో..



సాగర్‌రోడ్ కాలనీలో



తిలక్‌నగర్‌లో..

- ప్రమాదంలో పాత ఇళ్లు
- భయంభయంగా గడుపుతున్న బాధితులు
- యజమానులకు నోటీసులు ఇచ్చి.. తరువాత పట్టించుకోని అధికారులు

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలోని బల్దియాల్లో పాత ఇళ్లు శిథిలావస్థకు చేరి భయపెడుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఎప్పుడు కూలుతాయోనని బాధితులు భయాందోళన చెందుతున్నారు. గతంలో వర్షాకాలంలో గోడలు నాని ఇళ్లు కూలిన ఘటనలు అనేకం చోటుచేసుకున్నా.. తప్పని పరిస్థితుల్లో పలువురు పురాతన ఇళ్లలో కాలం వెల్లదీస్తున్నారు. ఏదైనా హడావుడి చేసే అధికారులు, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం లేదు. ఏటా వర్షాకాలం ముందు బల్దియాల్లో శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్ల విషయమై సర్వే నిర్వహించాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రాణాపాయం ఉన్న చోట నుంచి నిస్సహాయులకు తాత్కాలిక పునరావాసం కల్పించాలి. బాధితులను ఆదుకునేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక నిధి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనల ప్రకారం

నిబంధనల ప్రకారం 70–80 ఏళ్ల దాటిన పాత భవనాలను ప్రజాభద్రత దృష్ట్యా కూల్చేసే అధికారం బల్దియాలకు ఉంది. ముందుగా యజమానులకు నోటీసు ఇవ్వాలి. ఈక్రమంలో ఆయా ఇంటి యజమానులు వారంరోజుల్లో స్ట్రక్చర్ స్టెబిలిటీ సర్టిఫికెట్ సమర్పించాలి లేదా కూల్చేసుకోవాలి. వారు స్పందించకుంటే వెంటనే టౌన్‌ప్లానింగ్ అధికారులు వెంటనే తొలగించాలి. కానీ, రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు పాత భవనాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. గతంలో పట్టణప్రగతిలో శిథిలావస్థలో ఉన్నవాటిని గుర్తించినా పూర్తిస్థాయిలో అమలు కాలేదు. కేవలం ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా ఇళ్లు కూలిపోతే రెవెన్యూ అధికారులు వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపించి చేతులు దులుపుకుంటున్నారు. కాగా, ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వివరణ కోరగా.. పాత ఇళ్లకు సర్వే చేసి నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఆ ఇళ్లలో నివాసం ఉండవద్దని సూచించామని, శిథిలావస్థకు చేరిన ఇళ్లు వర్షాలు వచ్చినప్పుడు నాని కూలిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అప్రమత్తంగా ఉండాలని కోరారు.

న్యూస్‌రీల్

ఆదర్శ పాఠశాల సందర్శన



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఈవో మాధవి

ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రంలోని ఆదర్శ విద్యాలయాన్ని గురువారం జిల్లా విద్యాధికారి మాధవి సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించారు. టీచింగ్ డైరీ, సెలన్ ప్లాన్స్, పీరియడ్ ప్లాన్స్, బేస్‌లైన్ టెస్టుకు సంబంధించిన డైరీలను తనిఖీ చేశారు. విద్యాలయంలో నిర్వహిస్తున్న ఎఫ్ఎం రేడియో ప్రోగ్రాం, మంత్లీ మ్యాగ్జిన్ గురించి ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ డీఈవోకు వివరించారు. కాగా ఈ ప్రోగ్రాం కొత్త ఒరవడిని సృష్టించి విద్యార్థులకు లాభదాయకంగా ఉంటుందని ప్రిన్సిపాల్‌ను డీఈవో అభినందించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతీ పాఠశాలలో ప్రవేశపెట్టాలని సూచించారు. మండల విద్యాధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎల్లంపల్లి'కి స్వల్ప ఇన్‌ఫ్లో



ఎల్లంపల్లి ప్రాజెక్టు

రామగుండం: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి క్రమంగా ఇన్‌ఫ్లో పెరుగుతోంది. నీటిపారుదల శాఖ అధికారులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.0655 టీఎంసీలున్నాయి. ప్రాజెక్టులోకి 3,665 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, హైదరాబాద్ మెట్రో 331 క్యూసెక్కులు, ఎన్టీపీసీ 121 క్యూసెక్కులు ఔట్‌ఫ్లో చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

సుందిళ్ల గ్రామస్తులకు ఎక్స్‌గ్రేషియా చెల్లింపు



చెక్కు అందజేస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి మైనింగ్ లీజు భూముల ఎక్స్‌గ్రేషియా సుందిళ్ల రైతులకు చెల్లించామని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ తెలిపారు. జీఎం కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన గ్రామస్తులకు చెక్కులు అందజేశారు. జీఎం మాట్లాడుతూ జీడీకే–5 ఓసీ పరిధిలోని సింగరేణి మైనింగ్ లీజు భూములను సుందిళ్ల గ్రామ రైతులు తాత్కాలికంగా కొంతకాలం జీవనోపాధి కోసం ఉపయోగించుకున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు ఆ భూమిలో ఓసీపీ విస్తరణ పనులు చేపడుతున్న క్రమంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కలెక్టర్ కోయ శ్రీహర్ష, సంస్థ సీఎండీ ఆదేశాల మేరకు ఎక్స్‌గ్రేషియా అందజేస్తున్నట్లు తెలిపారు. ఎకరానికి రూ.6.50లక్షల చొప్పున 16.04 ఎకరాలకు ఏడు చెక్కులు అందజేసినట్లు వెల్లడించారు. ఈ ఎక్స్‌గ్రేషియా చెల్లింపు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎస్వోటూ జీఎం ఆంజనేయప్రసాద్, ప్రాజెక్ట్ అధికారి డి.రమేశ్, డీజీఎం సర్వే జీఎల్‌రాజు, డీజీఎం ఫైనాన్స్ ధనలక్ష్మీబాయి, ఎస్టేట్ అధికారి సాంబశివరావు, లా ఆఫీసర్ అఫ్రిన్ సుల్తానా పాల్గొన్నారు.

ఆపరేషన్ ముస్కాన్.. బడిలో చేరిక

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెద్దరాతుపల్లి లోని చెంచు బాలికను గురువారం అధికారులు గుర్తించి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో చేర్పించారు. కార్మికశాఖ, పోలీసు శాఖ సంయుక్తంగా ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బడికి వెళ్లకుండా కూలిపనికి వెళ్తున్న బాలబాలికలను గుర్తించి బడిలో చేర్పిస్తున్నట్లు ఎంఈవో మహేశ్‌కుమార్ పేర్కొన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సునీత, కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీదేవి, సీఆర్పీలు కుమారస్వామి, చందర్, వీరయ్య, చంద్రకళ పాల్గొన్నారు.

అందుబాటులో ఉండాలి

మంథని: హాస్టల్ వార్డెన్లు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని జిల్లా సంక్షేమ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. గురువారం మంథనిలోని బాలుర కళాశాల హాస్టల్ విద్యార్థులు ఆందోళన చేపట్టగా ఆయన సందర్శించారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వార్డెన్ రమేశ్‌ను ఆదేశించారు. హాస్టల్లోని సమస్యలపై విచారణ జరిపి జిల్లా కలెక్టర్, రాష్ట్ర కమిషనర్‌కు నివేదిక పంపడం జరిగిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై దృష్టి పెట్టండి

- సీపీ అంబర్‌కిషోర్‌ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా

గోదావరిఖని(రామగుండం): సైబర్‌నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝా ఆదేశించారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీస్ అధికారులతో నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెద్ద సమస్యగా మారాయని, వీటిని సమర్థవంతంగా ఎదుర్కొంటూనే ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అందుబాటులో ఉన్న టెక్నాలజీని అనుసరిస్తూ దర్యాప్తు చేపట్టాలన్నారు. మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించి కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయడంతోపాటు, నిందితులకు కోర్టులో శిక్ష పడేలా తగు సాక్ష్యాధారాలను అందజేయాలన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికలకు పోలీసు అధికారులు, సిబ్బంది సన్నద్ధం కావాలన్నారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని, శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మంచిర్యాల, పెద్దపల్లి డీసీపీలు ఎ.భాస్కర్, కరుణాకర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్లు, రవికుమార్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

లారీ సంక్షేమ సంఘంలో సంక్షోభానికి తెర

గోదావరిఖని(రామగుండం): లారీ సంక్షేమ సంఘంలో సంక్షోభానికి తెరపడింది. ఇతర ప్రాంతానికి చెందిన నాలుగు లారీలు ఎన్టీపీసీ ప్రాంతానికి రాగా వాటిని కొంత మంది అడ్డుకుని గోడౌన్‌కు తరలించారు. స్థానికులకు అవకాశం కల్పించడంలేదని ఓ వ్యక్తి పెట్రోల్ సీసాతో అసోసియేషన్ కార్యాలయానికి వచ్చి హంగామా సృష్టించడంతో విభేదాలు చర్చకు దారి తీశాయి. ఎమ్మెల్యే అనుమతితోనే ఈపని చేశామంటూ సదరు లారీల డ్రైవర్లకు చెప్పడంతో..వారి తరఫున ఉన్నతస్థాయిలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది. దీంతో సీరియస్ అయిన ఎమ్మెల్యే సంఘం నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి రాజీనామా చేశారు. గురువారం ఎమ్మెల్యేను కలిసి జరిగిన ఘటనపై క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగినట్లు తెలుస్తోంది. మళ్లీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

వానొచ్చింది.. వరదొచ్చింది



ఎలిగేడులో నీటమునిగిన వరి పొలం

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్/ఎలిగేడు/ఓదెల: జిల్లాలో రెండురోజులుగా కురుస్తున్న వర్షానికి పలుచోట్ల పంటలు నీటమునిగాయి. పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలోని రైల్వే క్రాసింగ్ గేటును మూసివేసి అండర్‌బ్రిడ్జి నిర్మించగా, బ్రిడ్జి వద్ద మోకాలిలోతు నీటిలో వాహనదారులు రాకపోకలు సాగించడం కష్టంగా మారింది. ఎలిగేడు మండలంలో పంటపొలాలు నీటమునిగాయి. ఓదెల మండలంలో గోపరపల్లె చెరువు మత్తడి పడడంతో మత్స్యకారులు చేపలు పట్టారు. అలాగే ఓదెల-కొలనూర్ గ్రామాల మధ్యలో తారురోడ్డు కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఓదెల-కొలనూర్ మధ్య కొట్టుకుపోయిన రోడ్డు



కొత్తపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన నీరు

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం(ధర్మపురి): గురుకులం విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. గురువారం ధర్మారం మండలం మల్లాపూర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా డైనింగ్‌హాల్, టాయిలెట్స్, పరిసరాల శుభ్రతను పరిశీలించారు. పరిసరాల్లో ఏపుగా పెరిగిన చెట్లను తొలగించాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న డైనింగ్‌హాల్‌కు నిధులు మంజూరు చేస్తానని వెంటనే మరమ్మతు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి నిధులు కేటాయించాలని కోరారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, నాలుగు నెలల పాటు నెలలో రెండుసార్లు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు పరీక్షలు చేయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రాష్ట్రంలోనే మల్లాపూర్ గురుకులం విద్యాలయానికి మంచి పేరుందని, ఆ పేరును ఉపాధ్యాయులు కాపాడాలని కోరారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాధవి, మెస్ ఇన్‌చార్జి రత్నాప్రసూన్న, నియోజకవర్గ యువకాంగ్రెస్ అధ్యక్షుడు అసోద అజయ్, గందం మల్లయ్య, గందం మహిపాల్, రామడుగు గంగారెడ్డి, రాజు, శివ పాల్గొన్నారు.

భళా.. హస్తకళ మేళా





మేళాలో చేనేత, హస్తకళ స్టాల్స్

కోల్‌సిటీ(రామగుండం): చూడచక్కని బొమ్మలు, ఆకట్టుకునే ధర్మవరం, వెంకటగిరి, గద్వాల్, పోచంపల్లి చీరలు, ఉడన్ హ్యాండీ క్రాఫ్ట్స్, ఒడిశా పేయింటింగ్, జైపూర్ స్టోన్ జ్యూవెల్లరి, హరియాణా బెడ్ కవర్స్, కోల్‌కత్తా బ్యాగ్స్.. కళ్లు మిరుమిట్లు గొలిపే వస్తువులకు గోదావరిఖని వేదికయింది. ఆధునిక సొబగులద్దుకుంటున్న సంప్రదాయ హస్తకళను హైదరాబాద్‌కు చెందిన 'కళా సిల్క్ చేనేత హస్తకళా సొసైటీ' ప్రత్యేక మేళాను గురువారం గోదావరిఖనిలో ప్రారంభించింది. సింగరేణి కమ్యూనిటీ హాల్లో హస్తకళ, చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేయగా, పలు రాష్ట్రాలకు చెందిన కళాకారులు తయారు చేసిన హస్తకళలను ప్రదర్శనకు పెట్టారు.

ఆకట్టుకుంటున్న చీరలు

తెలంగాణలో ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లి, గద్వాల, నారాయణపేట పట్టు చీరలతోపాటు ఏపీలోని ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కళంకారి, ఉప్పాడ, అస్సాం మూగా, బిహార్ బాగల్పుర సిల్క్స్, టస్సర్, జమ్మూకశ్మీర్‌లోని ఎంబ్రాయిడరీ చీరలు, గుజరాత్‌లోని బాందని, కచ్చ ఎంబ్రాయిడరీ శారీస్, రాజాస్థాన్‌లోని కోటా, బంధాని, ఉత్తరప్రదేశ్‌లోని జమ్దాని, బనారస్, లక్నో డ్రెస్ మెటీరియల్స్, ఛత్తీసగఢ్ ట్రిబిల్ వర్క్స్ కోసా సిల్క్, ఫ్యాన్సీ చీరలు, చుడీదార్స్, హ్యాండి క్రాఫ్ట్స్, హ్యాండ్‌లూమ్స్ ఆకట్టుకుంటున్నాయి.

కళాకారులను ప్రోత్సహించాలి



చేనేత వస్త్రాలు, హస్తకళలు, హ్యాండ్‌లూమ్స్ కళాకారులను ప్రోత్సహించాలి. మా సొసైటీ ద్వారా పలు రాష్ట్రాల్లోని చేనేత, హ్యాండ్రీక్రాఫ్ట్స్ కళాకారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించేందుకు ఇలా ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేస్తున్నాం. – వినోద్‌సింగ్ నెగి, కళాసిల్క్ సొసైటీ మేనేజర్

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరంలో కాలుష్య నివారణకు మొక్కల పెంపకమే ఏకైక పరిష్కారమని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గురువారం గోదావరిఖని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో బల్దియా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మొక్కలు నాటి మాట్లాడారు. నగరంలో పచ్చదనం పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ముగ్గులువేసి చెత్తపై అవగాహన

గోదావరిఖనిలోని చంద్రశేఖర్‌నగర్‌లో చెత్త జమయ్యే ప్రాంతాలను పారిశుద్ధ్య విభాగం సిబ్బంది శుభ్రం చేసి ముగ్గులు వేశారు. బయట చెత్త వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించాలని అవగాహన కల్పించారు. మల్లికార్జున్ నగర్‌లోని మేజర్ కాలువలో పూడిక తొలగించే పనులు చేపట్టారు. కేసీఆర్‌కాలనీలో పిచ్చిచెట్లు తొలగించారు. నగరపాలక డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, డీఈ షాభాజ్, ఏఈ తేజస్విని, ప్రిన్సిపాల్ సంజీవ్ పాల్గొన్నారు.



అవును.. ఇది ఉప కాల్వే..

కమాన్‌పూర్(మంథని): అవును ఈ ఫొటోలో ఉన్నది కాల్వే..మండలపరిధిలో పంటలకు సాగునీరు అందించే ఎస్సారెస్పీ కాల్వలు పిచ్చిమొక్కలతో చిట్టడవిని తలపిస్తున్నాయి. ఎస్సారెస్పీ నుంచి సాగునీరు అందించే డీ-83 కెనాల్ పరిధిలోని ఎల్-36, ఎల్-37 ఉప కాల్వల్లో చెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డీ-83 కెనాల్‌కు నీరు విడుదల చేస్తే ఉపకాల్వల ద్వారా ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందే పరిస్థితి లేదని రైతులు పేర్కొంటున్నారు. వేసవిలో ఉప కాల్వల్లో చెట్ల తొలగింపు, పూడిక తీయించాల్సి ఉండగా ఆ పనులు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

క్లుప్తంగా

స్వగ్రామం చేరిన సాగర్ మృతదేహం



సాగర్ శవపేటిక వద్ద రోధిస్తున్న కుటుంబసభ్యులు



సాగర్(ఫైల్)

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన బత్తుల సాగర్(42) ఈ నెల 22న కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం మృతదేహం స్వగ్రామం చేరింది. ఉపాధి కోసం సాగర్ మూడేళ్ల క్రితం గల్ఫ్ వెళ్లాడు. కుటుంబ సభ్యుల రోధనల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



రమేశ్ మృతదేహం

గొల్లపల్లి: అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తిర్మలాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గండికోట రమేశ్ (37) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. వచ్చిన సంపాదనతో భార్య మంజుల, ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నాడు. ఉండడానికి ఇల్లు కూడా లేకపోవడంతో రెండేళ్ల క్రితం ఇంటి నిర్మాణానికి పూనుకున్నాడు. ఈ క్రమంలో అప్పు చేశాడు. పిల్లల్లో ఒకరు అనారోగ్యం బారిన పడ్డారు. వైద్య ఖర్చులకు మరింత అప్పు చేశాడు. వాటిని తీర్చేదారి లేక జీవితంపై విరక్తి చెంది సాయంత్రం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు వచ్చేసరికే చనిపోయాడు. ఇంటి పెద్ద మృతిచెందడంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగింది. రమేశ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి తెలిపారు.

వస్తువుల బహిరంగ వేలం

కరీంనగర్: నగరంలోని కార్ఖానగడ్డ ప్రభుత్వ దివ్యాంగుల, వయో వృద్ధుల వసతి గృహంలో నిరుపయోగంగా ఉన్న ఫర్నీచర్, బీరువాలు, చెక్క కప్‌బోర్డ్స్, ఫిజియోథెరపి చైర్ తదితర వస్తువులను బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వస్తువులను ప్రభుత్వ దివ్యాంగుల, వయో వృద్ధుల వసతి గృహంలో ఈనెల 28వ తేదీ వరకు పరిశీలించుకుని వేలంలో పాల్గొనవచ్చునని అన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పని దినములలో 8096338488, 9492930728 నంబర్లను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

సాఫల్యం.. వైఫల్యం!

- జిల్లాలో 20 శాతం మంది బాధితులు
- జీవనశైలి మార్పులే కారణం
- పెరిగిన సంతాన సాఫల్య కేంద్రాలు
- నేడు వరల్డ్ ఐవీఎఫ్ డే



కరీంనగర్‌టౌన్: వివాహమైన ప్రతీ స్త్రీ తల్లి కావాలని కోరుకుంటుంది. అయితే ఆ యోగ్యత కొందరికి మాత్రం లభించడం లేదు. ఇందుకు ఆమెలో కొన్ని అనారోగ్య కారణాలు, లేదా భర్తలో ఏదైనా లోపమైనా ఉండొచ్చు. వైద్యులను సంప్రదించి వారి సూచనలు పాటిస్తూ మహిళలు గర్భం దాలుస్తున్నారు. అమ్మ కల నెరవేర్చుకుంటున్నారు. ఐవీఎఫ్ విధానం ద్వారా చికిత్స తీసుకుంటున్నారు. నేడు వరల్డ్ ఐవీఎఫ్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

పెరుగుతున్న సంతానలేమి సమస్య

ఇటీవల ఉమ్మడి జిల్లాలో సంతానలేమి సమస్యతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోంది. ఒకప్పుడు వందలో ఒకరిద్దరు మాత్రమే సంతానలేమితో బాధపడేవారు. ఇప్పుడు ఆసంఖ్య 20శాతం వరకు ఉంటోంది. ఇలాంటి వారు వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకుని గర్భం దాలుస్తున్నారు. కొందరు మాత్రం మూఢ నమ్మకాలతో కాలం వెళ్లదీస్తున్నారు. కాలానుగుణంగా ఇప్పుడు వైద్యంపై అవగాహన పెరిగింది. గతంలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లి సంతాన సాఫల్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించేవారు. ఇప్పుడు కరీంనగర్‌లో కూడా అలాంటి కేంద్రాలు ఏర్పాటయ్యాయి. అత్యాధునిక వసతులు, సౌకర్యాలతో మహానగరాల్లో అందించే వైద్యసేవలు ఇక్కడ అందిస్తున్నారు. కరీంనగర్‌లో పదికి పైగా ఫెర్టిలిటీ కేంద్రాలు (సంతాన సాఫల్య కేంద్రాలు) ఉన్నాయి. ఆయా కేంద్రాలకు ప్రస్తుతం రోజూ 30 నుంచి 40 మందిదాకా చికిత్స కోసం వస్తుంటారు.

సంతానలేమికి కారణాలివే..

ఇటీవల యువతీ యువకులు జీవితంలో స్థిరపడ్డాక వివాహం చేసుకుంటున్నారు. అమ్మాయిల సంఖ్య తగ్గిపోవడం వంటి కారణాలతో ఆలస్యంగా వివాహం చేసుకుంటున్నారు. దీంతో సంతానలేమి సమస్యలు పెరుగుతున్నాయి. మారిన జీవనశైలి, వ్యాయామం లేకపోవడం, స్థూలకాయం, మహిళల్లో పీసీఓడీ (అండాశయంలో తిత్తులు), రాత్రివేళల్లో ఆలస్యంగా నిద్రపోవడం, జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం తదితర కారణాలతో సంతానలేమి సమస్య కలుగుతుంది.

ఐవీఎఫ్ అంటే..

చాలామంది సంతానం లేనివారు సంతాన సాఫల్య కేంద్రాలకు వెళ్తున్నారు. కానీ అక్కడ ఐవీఎఫ్ పద్ధతి గురించి వారికి అవగాహన ఉండదు. ఈ పద్ధతిలో బిడ్డను జన్మనివ్వాలి అనుకునే దంపతులు ముందుగా దాని గురించి అవగాహన ఉండాలి. అప్పుడే భవిష్యత్‌లో వారి మధ్య అపోహలు తలెత్తకుండా ఉంటాయి. సాధారణంగా స్త్రీ గర్భధారణ కలగాలంటే మగవారి వీర్యకణాలు ఆడవారి అండంతో కలవాలి. అది పిండంగా రూపాంతరం చెందుతుంది. ఈ విషయంలో ఇబ్బంది ఉన్నప్పుడు ఐవీఎఫ్ విధానంలో ల్యాబ్‌లో అండకణాలను సంగ్రహించడం చేసి స్పెర్మ్ నమూనాను మెరుగుపరుస్తారు.

ఐవీఎఫ్ ఎప్పుడు అవసరమంటే..

సాధారణంగా సంతానం లేనివారికి ఐవీఎఫ్ అవసరం లేదు. ముందుగా వైద్యులను సంప్రదించి సమస్యను వివరించాలి. దీన్ని బట్టి ముందుగా సహజసిద్ధంగా గర్భం దాల్చేలా తగిన చికిత్స, ఔషధాలు అందిస్తారు. సహజ సిద్ధంగా గర్భధారణ కలిగేందుకు అవకాశం లేకుండా ఉన్నవారికి మాత్రమే ఐవీఎఫ్ చికిత్స ప్రారంభిస్తారు. ముఖ్యంగా ఆడవారిలో ఫెలోపియన్ నాళాలు మూసుకుపోయినప్పుడు, అండకణాలు తక్కువగా ఉన్నప్పుడు, అండాశయ ట్యూబ్స్ బ్లాక్ అయినప్పుడు, ఎక్కువసార్లు అబార్షన్లు అయినవారికి, క్యాన్సర్ రోగులు, మగవారిలో స్పెర్మ్ నాణ్యత తక్కువగా, పూర్తిగా లేనప్పుడు ఐవీఎఫ్ చికిత్స అవసరం ఉంటుంది.

అపోహలు వద్దు



1978 జులై 25న ఇంగ్లండ్‌లో ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) అనే కృత్రిమ గర్భధారణ పద్ధతిలో జన్మించిన మొదటి బిడ్డ లూయిస్ బ్రౌన్ అయ్యారు. ఈ విజయానికి గుర్తుగా ఏటా జులై 25న ప్రపంచ ఎంబ్రియాలజిస్ట్ డేగా జరుపుతారు. ఇప్పటికీ చాలామందికి ఐవీఎఫ్ అంటే తెలియని భయం. సంతానం కలిగేందుకు అన్ని ప్రయత్నాలు చేసి విఫలమైనప్పుడు మాత్రమే ఐవీఎఫ్ మార్గాన్ని సూచిస్తాం.

– డాక్టర్ రేఖారాణి, రేఖాసాగర్ ఐవీఎఫ్ సెంటర్

సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు



30 ఏళ్లు దాటిన మహిళలకు సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ విధానం ద్వారా ఇప్పటివరకు 8 మిలియన్ల మందికి పైగా జన్మించారు. అయితే ఐవీఎఫ్‌పై చాలామందికి అపోహలున్నాయి. ఐవీఎఫ్‌లోనూ ఐసీఎస్ఐ, ఐవీఎం, ఎగ్‌ఫ్రీజింగ్, స్పెర్మ్ ఫ్రీజింగ్, ఫెర్టిలిటీ ప్రిజర్వేషన్, ప్రీ ఇంప్లాంటేషన్, జనటిక్ టెస్ట్ అనే అడ్వాన్స్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాయి. ఐవీఎఫ్‌లో ఇచ్చే మందులతోనూ ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు.

– డాక్టర్ రజని ప్రియదర్శిని, రజని ఫెర్టిలిటీ సెంటర్

ప్రభుత్వ ఆస్పత్రిలో కత్తిపోట్ల కలకలం



పాలకుర్తి మహేశ్(ఫైల్)

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిలో గురువారం కత్తిపోట్ల కలకలం రేపింది. స్థానికులు కథనం.. చొప్పదండి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన శ్రావణిని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి చెందిన పాలకుర్తి మహేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు.కాగా... శ్రావణి ఇటీవలే గర్భం దాల్చగా చికిత్స నిమిత్తం భర్త పాలకుర్తి మహేశ్ కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. ఆమెకు రక్తస్రావం కావడం.. కడుపులో పిండం సరిగా లేకపోవడంతో వైద్యులు అబార్షన్ చేశారు. విషయం తెలుసుకున్న శ్రావణి అన్న అదే ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న మహేశ్ బావ పాలకుర్తి మహేశ్‌పై కత్తితో దాడిచేశాడు. దీంతో ఆయనకు పలుచోట్ల గాయాలయ్యాయి. హాస్పిటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వండంతో టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. గాయపడ్డ పాలకుర్తి మహేశ్ నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

వార్డెన్‌పై చర్య తీసుకోవాలి



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, సంఘాల నాయకులు

మంథని: మంథనిలో ఎస్సీ బాలుర కళాశాల వసతిగృహ విద్యార్థులు గురువారం రోడ్డెక్కారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో రాస్తారోకో చేశారు. మెనూ ప్రకారం వార్డెన్ సరుకులు ఇవ్వడం లేదని, సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని వాపోయా రు. వారానికి ఒకసారి మాత్రమే వసతి గృహానికి వచ్చి సరుకులు ఇచ్చి వెళ్తున్నారని, అవి సరిపోవడం లేదని పేర్కొన్నారు. టిఫిన్ ఆలస్యమవుతుందని, తమ ఆలస్యంపై ప్రిన్సిపాల్ పలుమా ర్లు హెచ్చరించారని ఆవేదన వెలిబుచ్చా రు. విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు మద్దతుగా రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు సంఘాల జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్, గొర్రంకల సురేశ్ మాట్లాడుతూ, విద్యార్థులకు సమయానికి సరుకులు ఇవ్వకుండా, రోజువారీ మెనూ పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్ రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డివిజన్, జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో వసతి గృహాల సంరక్షకులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు, నాయకులకు పోలీసులు సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.

రామానుజమ్మకు జాతీయ పురస్కారం



నటుడు భానుచందర్ నుంచి జాతీయ ప్రతిభ పురస్కారం అందుకుంటున్న రామానుజమ్మ

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన వెటరన్ అథ్లెట్ టమటం రామానుజమ్మకు మరో ప్రతిభ పురస్కారం వరించింది. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ వైఎంకే అకాడమీ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ ఎక్సలెంట్ అవార్డులను ప్రదానం చేశారు. సిరిసిల్లకు చెందిన వెటరన్ అథ్లెట్, మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ టమటం రామానుజమ్మను ఎంపిక చేశారు. వైఎంకే అధ్యక్షుడు, సినీ నటుడు భానుచందర్ అవార్డును అందజేశారు. ఏడుపదుల వయసులో జాతీయ స్థాయి పురస్కారం అందుకున్న రామానుజమ్మను పలువురు అభినందించారు.

మారుతి రైస్‌మిల్ అనుమతులు రద్దు

- కమర్షియల్ నుంచి అగ్రికల్చర్‌కు మార్పు
- ఆదేశాలు జారీ చేసిన అధికారులు



రైస్‌మిల్‌పై విచారణ చేపడుతున్న అధికారులు (ఫైల్)

వేములవాడరూరల్: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి మిల్లు నిర్మించిన వ్యవహారంపై పలువురి ఫిర్యాదుతో విచారణ చేపట్టిన అధికారులు సదరు మిల్లు అనుమతులు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వేములవాడరూరల్ మండలం మర్రిపల్లి శివారులో సర్వేనంబర్ 750లోని మల్లయ్యకుంటలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి రైస్‌మిల్లును కొందరు వ్యాపారులు నిర్మించిన విషయంపై గతంలో మల్లారం మాజీ ఎంపీటీసీ సంగెం వీరారెడ్డితోపాటు పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు ఎట్టకేలకు ఆ మిల్లును కమర్షియల్ నుంచి అగ్రికల్చర్‌కు మార్పు చేసినట్లు వెల్లడించారు. సర్వేనంబర్ 750లో 18 ఎకరాల 18 గుంటల స్థలంలో దాదాపు 5 ఎకరాలకు మాత్రమే మిల్ యజమానులు నాలా కన్వర్షన్ తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. మిల్లు అనుమతులను, నాలా కన్వర్షన్‌ను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వరుస కథనాలతో కదలిన యంత్రాంగం

మర్రిపల్లి శివారులో నిర్మించిన మారుతి రైస్‌మిల్లు నుంచి వస్తున్న వ్యర్థాలు, కలుషితంతో ఆ ప్రాంత రైతులకు, పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయంపై ‘సాక్షి’లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాలపై స్పందించిన అధికారులు గతంలో పలుమార్లు విచారణ చేపట్టారు. ప్రభుత్వ స్థలంలో మిల్లు నిర్మించినట్లు గుర్తించారు. ఎట్టకేలకు ఆ మిల్లు అనుమతులను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు



మర్రిపల్లి శివారులో మారుతి రైస్‌మిల్లును నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించారు. ప్రభుత్వ స్థలాన్ని సైతం ఆక్రమించారు. దీనిపై ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ స్పందించి అనుమతులు రద్దు చేయించారు. రైతులు, గ్రామస్తుల తరఫున కలెక్టర్‌కు కృతజ్ఞతలు.

– సంగెం వీరారెడ్డి, మాజీ ఎంపీటీసీ, మల్లారం

ఉత్తర్వులు వచ్చాయి



మర్రిపల్లి శివారులో నిర్మించిన మారుతి రైస్‌మిల్లు అనుమతులు రద్దు చేసినట్లు ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించినట్లు ఫిర్యాదులు రావడంతో ఉత్తర్వులు వచ్చాయి.

– అబూబాకర్, తహసీల్దార్, వేములవాడరూరల్

వేధిస్తున్నాడని భార్యనే హతమార్చింది !

- గంజాయి కేసు విచారణతో హత్య కేసు వెలుగులోకి..
- మద్యానికి బానిసై వేధిస్తున్నాడని ఐదుగురితో కలిసి అఘాయిత్యం
- రెండేళ్ల క్రితం కొండగట్టులో దారుణం
- హత్యోదంతం అంతా సెల్‌ఫోన్‌లో చిత్రీకరణ
- గుర్తు తెలియని వ్యక్తి మృతి కేసుగా నమోదు
- నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్, సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్

మల్యాల: రెండేళ్ల క్రితం.. మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టులో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. గుర్తు తెలియని వ్యక్తిని మెట్‌పల్లికి చెందిన సింగం నడిపి గంగాధర్(40)గా గుర్తించారు. మద్యానికి బానిసై నిత్యం వేధిస్తున్నాడని ఆయన భార్యే మరో నలుగురితో కలిసి హత్య చేసినట్లు నిర్ధారించారు. హత్యోదంతాన్ని నిందితులు వీడియో చిత్రీకరించారు. గంజాయి కేసులో పట్టుబడిన నిందితులను విచారించగా ఈ విషయాలన్నీ వెలుగుచూశాయి. రెండేళ్ల క్రితం జరిగిన ఈ సంఘటన సంబంధించిన వివరాలను డీఎస్పీ రఘుచందర్ స్థానిక సీఐ కార్యాలయంలో గురువారం వెల్లడించారు. ముత్యంపేట శివారులో 2023 మార్చి 14న గుర్తు తెలియని వ్యక్తి కాలిపోయి ఉన్నాడని అప్పటి వీఆర్ఏ అజీమొద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈనెల 17న మెట్‌పల్లికి చెందిన సింగం గ్రాహిత్, అబ్దుల్ అప్సర్, చెన్న నిఖిల్‌ను మెట్‌పల్లి పోలీసులు గంజాయి కేసులో అరెస్టు చేశారు. వారి వద్దనున్న సెల్‌ఫోన్‌లు పరిశీలించగా.. హత్యకు సంబంధించిన వీడియో కనిపించింది. దీనిపై వారిని విచారించారు. మెట్‌పల్లికి చెందిన సింగం నడిపి గంగాధర్ మద్యానికి బానిసై నిత్యం భార్య సంధ్య, కుటుంబసభ్యులను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఇంట్లో వస్తువులు అమ్ముకుని జూదం ఆడేవాడు. నిత్యం మద్యం సేవించి వచ్చి హింసించేవాడు. పెద్ద కూతురు వివాహం చేసేందుకూ అడ్డుపడడంతో రూ.10వేలు ఇచ్చి ఒప్పించి.. బిడ్డ వివాహం చేశారు. కూతురి అత్తవారింటికి వెళ్లి అల్లుడితోనూ గొడవ పడేవాడు. ఈ విషయాన్ని సంధ్య గంగాధర్ అన్న కొడుకు గ్రాహిత్, తోటికోడలు మమతకు చెప్పింది. వారు గొడవ చేయవద్దని చెప్పినా గంగాధర్ వినిపించుకోలేదు. అతడిని చంపితేనే తాము సంతోషంగా ఉంటామని నిర్ణయించుకున్న సంధ్య.. గ్రాహిత్‌కు విషయం చెప్పింది. రూ.40వేలు ఇస్తే మరో ముగ్గురిని తీసుకొస్తానని అతడు చెప్పగా ఆ మొత్తం అందించింది. గ్రాహిత్ తన స్నేహితులైన అబ్దుల్ అప్సర్, పవన్ కలిసి గంగాధర్‌ను చంపేందుకు ఒప్పుకున్నారు. 2023 మార్చి 12న కారును అద్దెకు తీసుకుని సంధ్య, గ్రాహిత్, అబ్దుల్ అప్సర్, చెన్న నిఖిల్, పవన్, సింగం మమత కొండగట్టుకు వెళ్దామని చెప్పి గంగాధర్‌ను ఎక్కించుకుని ముత్యంపేట శివారు డంపింగ్‌యార్డు సమీపంలోకి చేరుకున్నారు. అక్కడ గంగాధర్‌కు మద్యం తాగించారు. సంధ్య, మమత గంగాధర్ కాళ్లు పట్టుకోగా.. గ్రాహిత్, అప్సర్ వైర్‌ను మెడకు చుట్టి ఊపిరాడకుండా చేశారు. నిఖిల్ ఎవరైనా వస్తున్నారా అని గమనిస్తూ ఉన్నాడు. గంగాధర్ చనిపోయాడని నిర్ధారించుకుని శవాన్ని ఎవరూ గుర్తించకుండా చెత్తలో వేసి నిప్పంటించారు. ఈ హత్యోదంతాన్ని మొత్తం వీడియోతీశారు. అనంతరం మెట్‌పల్లి వెళ్లిపోయారు. మార్చి 14న గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న మృతదేహాన్ని స్థానికులు గమనించి వీఆర్ఏ అజీమొద్దీన్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. గంజాయి కేసు విచారణలో సెల్‌ఫోన్‌లో హత్యకు సంబంధించిన వీడియో ఉండడంతో ఘటనలో ఆరుగురు పాల్గొన్నారని పోలీసులు నిర్ధారించుకున్నారు. వీరిలో గ్రాహిత్, అబ్దుల్ అప్సర్, నిఖిల్ ఇప్పటికే గంజాయి కేసులో అరెస్టయి ఉన్నారు. పవన్ మరో కేసులో చంచల్‌గూడ జైలులో ఉన్నాడు. మమత మృతి చెందింది. ఏ–1 నిందితురాలైన సింగం సంధ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, మిగిలిన వారిని కోర్టు అనుమతితో విచారించి, అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ నీలం, ఎస్సై నరేశ్‌కుమార్ ఉన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

జూలపల్లి(పెద్దపల్లి): భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. వెంకట్రావుపల్లెకు చెందిన జుట్టు అంజయ్య(35) వికలాంగుడు. పదేళ్ల క్రితం దూళికట్టకు చెందిన జ్యోతితో పెండ్లి కాగా ముగ్గురు సంతానం. మూడునెలలుగా భార్య కాపురానికి రావడం లేదు. ఎంతగా ప్రయత్నం చేసినా భార్య రాక పోవడంతో అంజయ్య మానసికంగా బాధపడుతున్నాడు. ఈక్రమంలో రెండురోజులుగా ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి దొరకలేదు. గురువారం ఉదయం గ్రామంలోని ప్రభుత్వ తాగునీటి బావిలో మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి జుట్టు చిన్నవెంకయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

డెయిరీల్లో యూరియా అక్రమ నిల్వలు

- ఫర్టిలైజర్ దుకాణాల ద్వారా సరఫరా
- తనిఖీలు నామమాత్రమే.?

కరీంనగర్ అర్బన్: సాగుకు చేరాల్సిన రాయితీ యూరియా పక్కదారి పడుతోంది. అక్రమార్కుల విక్రత చేష్టలతో సాగు రంగానికి సవాల్‌గా మారగా నియంత్రించాల్సిన యంత్రాంగం మొద్దునిద్రలో జోగుతోంది. అన్నదాత సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.వేలల్లో భరిస్తూ రైతులకు తక్కువ ధరకు యూరియా సరఫరా చేస్తుండగా క్షేత్రస్థాయిలో మాత్రం కేంద్ర లక్ష్యం నీరుగారిపోతోంది. ఓ అధికారి, ఓ హోల్‌సేల్ డీలర్, పలువురు ఫర్టిలైజర్ దుకాణదారుల తీరుతో అభాసుపాలవుతోంది. బహిరంగంగా యూరియా నిల్వలు కనబడుతున్నా అధికారుల కళ్లకు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఎక్కడి నుంచి కొనుగోలు చేశారు, ఎపుడు కొనుగోలు చేశారు, అసలు సదరు యూరియా ఉత్పత్తి అయి ఎన్ని రోజులవుతోంది, తాజాగా వచ్చిందా.. గతంలోదా..అన్నది తేల్చేందుకు అన్ని అవకాశాలున్నా తదనుగుణ చర్యలు లేవన్న ఆరోపణలున్నాయి.

డెయిరీలు, దాణా తయారీ కేంద్రాల్లో భారీ నిల్వలు

పాల డెయిరీలు, పశువుల దాణా, కోళ్ల దాణా తయారీ చేసే కేంద్రాల్లో పెద్దమొత్తంలో యూరియా నిలవలున్నట్లు విశ్వసనీయ సమాచారం. చోట డెయిరీల నుంచి బడా డెయిరీల వరకు అక్రమార్గంలో యూరియాను కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు. పాల ఉత్పత్తిలో ఇది కీలకం కాగా నేరుగా కంపనీల నుంచి కొనాల్సిందిపోయి రైతుల పేరిట భారీ మొత్తంలో నిల్వ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు పాల డెయిరీలుండగా పశువుల దాణా, కోళ్ల దాణా తయారు చేసే కుటీర నుంచి భారీ పరిశ్రమలున్నాయి. ఈ నేపథ్యంలో వీటిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసే యంత్రాంగం కరవవడంతో వీరి దందా నిరాటంకంగా సాగుతోంది. సీజన్ వచ్చిందంటే చాలు ముందస్తు ప్రణాళికలతో సఫలీకృతులవుతున్నారు. ఏళ్లుగా ఈ దందా సాగుతుండగా పలువురు అధికారులకు ముడుపులు ముడుతున్నాయన్నది ఇంట, బయట వినిపిస్తున్న మాట.